క్లుప్తంగా

తక్షణసాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: అమలపాడు పంచాయతీ పరిధి చిన్న బత్సలవానిపేట గ్రామానికి చెందిన బత్సల విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. ఇతను వైఎస్సార్ బీమా పాలసీదారుడు. దీంతో అతని కుటుంబానికి తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు చేతుల మీదుగా మృతుని కుటుంబానికి ఆదివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోతనపల్లి లింగరాజు, ఉపాధ్యక్షులు కె.గిరిబాబు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



బూరగాంలో మన్మథరావును పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. బూరగాం గ్రామానికి చెందిన మాస్టీల మన్మథరావు తల్లి జేజెమ్మ, కుత్తుం గ్రామానికి చెందిన గొండేల సత్యనారాయణ, మండపల్లి గ్రామానికి చెందిన బెందాళం తేజేశ్వరరావు తల్లి కమలమ్మ మృతి చెందడంతో ఆయా కుటుంబాలను నాయకులు పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడి రామదాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు ఉన్నారు.

ఆజాద్ సైనిక్ సేవా సమితి ఔదార్యం



బాధితుడికి సాయాన్ని అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు రమేష్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆజాద్ సైనిక్ సేవా సమితి సభ్యులు 25 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడు రమేష్‌కు ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సేవా సమితి సభ్యులు దున్న జోగారావు, పుత్స భీమారావు, దున్న నారాయణరావు, దున్న శాంతారావు ఉన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



సత్కారం పొందిన ఉద్యోగులు

కంచిలి: విధినిర్వహణలో ప్రతిఉద్యోగి ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని మండలాభివృద్ధి అధికారి చల్లా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేసి, ఇటీవల వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఆరుగురు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మండల పరిషత్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ బృందావన్‌ను కంచిలి-1 సచివాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలంలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే




సర్వే చేస్తున్న వలంటీర్లు

కోటబొమ్మాళి: పట్టణంలోని ప్రధాన రోడ్డులో వలంటీర్లు డి.క్రిష్ణ, కె.అప్పన్న ఆదివారం ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేసి వివరాలను నమోదు చేశారు. సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వార్డు సభ్యులు ప్రదీప్, ఐ.చిరంజీవి పాల్గొన్నారు.

సొండికుల సంక్షేమ సంఘం కార్యవర్గం

కాశీబుగ్గ: పలాస మండల సొండికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడుగా షావుకారి షణ్ముఖరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక యూరోకిడ్ పాఠశాలలో ఆదివారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఉపాధ్యక్షుడుగా నెమలిపురి జగదీష్, కార్యదర్శిగా లాభాల రమేష్, జాయింట్ సెక్రటరీలుగా రత్నాల రమేష్, సాహుకారి సింహాచలం, కోశాధికారిగా సాహుకారి సుధీర్‌లు నియమితులయ్యారు.

ఆధ్యాత్మిక శోభ



సోంపేట: బెంకిలిలో పూజలందుకుంటున్న వినాయకుడు



కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లాలోని పెద్దవీధిలో ఆకట్టుకుంటున్న మండపం



కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లాలోని కడి వీధిలో..

గణపతి నవరాత్రులు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఏడో రోజైన ఆదివారం వినాయక మండపాలు భక్తులతో రద్దీగా మారాయి. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. మరోపక్క బొజ్జగణపయ్య విగ్రహాల నిమజ్జనాలు కూడా జోరందుకున్నాయి. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. గణపతి లడ్డూల వేలంలో యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అలాగే మండపాలు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి.



మందస: హరిపురంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న విఘ్నేశ్వరుడు



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో మహిళల నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



కోటబొమ్మాళి: విద్యుత్‌నగర్‌వీధిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



కాశీబుగ్గ: సూదికొండలో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం కొప్పల వీధిలో గణపతి లడ్డూను 55,555 రూపాయలకు దక్కించుకున్న భీమారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

తేలినీలాపురంలో క్విజ్ పోటీలు

టెక్కలి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తేలినీలాపురం గ్రామంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. పది పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై ప్రతిభను చూపారు. టెక్కలి మండలం సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమంగా నిలవగా.. టెక్కలి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో, అరుణ విద్యాలయం విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు మన్మథరావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించగా, పి.సూర్యారావు, బి.తారాపతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కె.ఫాల్గుణరావు సమకూర్చిన నగదును విజేతలకు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో హరిప్రసాద్, సూర్యారావు, గౌరీప్రసాద్, వెంకటరమణ, తవిటినాయుడు, అన్నాజీ, సీఆర్ ఎంటీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

• అ'పూర్వ' కలయిక



ఒకేవేదికపై పూర్వవిద్యార్థులు

కవిటి: బొరివంక జిల్లా ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సంబరపడ్డారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు పూడి బాలయ్య, బందరు ఉమామహేశ్వరరావు, బల్లెడ శంకరరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనారోగ్యంతో ఉన్న కొందరు తోటిమిత్రులకు ఆర్థికసాయం అందజేశారు.

చిన్నారులకు చేదోడుగా ఉంటాం

కంచిలి: చిన్నారులకు చేదోడుగా ఉంటామని తహసీల్దార్ ఎస్.హైమావతి అన్నారు. ఆదివారం బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాడుపూడి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు 'చిన్నారులకు చేదోడు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికా చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యార్థి దశనుంచే తమను తాము రక్షించుకొనే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కంచిలి జెడ్పీహెచ్ఎస్ పీడీ ఎం.రోజారమణి, స్థానిక హిందీ ఉపాధ్యాయురాలు ఎస్.సుజాత, ఏఎన్ఎం రోజా పాల్గొన్నారు.



కార్యక్రమంలో అధికారులు, విద్యార్థినులు

సహకార సంఘ అధ్యక్షుడికి సత్కారం

కాశీబుగ్గ: జిల్లా గొర్రెలు, మేకల సహకార సంఘ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాపాక చిన్నారావు యాదవ్‌కు ఆదివారం ఘన సత్కారం జరిగింది. పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామంలో ఉద్దాన ప్రాంతం గురుదాసుపురం పంచాయతీకి చెందిన గ్రామపెద్దలు, నాయకులు చిన్నారావు యాదవ్‌ను దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పానిల కృష్ణారావు, పానిల కూర్మారావు, జినగ సుధీర్, శ్యాం, పాపయ్య, దిలీప్, తాతారావు, తిరుపతిరావు, పోతనపల్లి సీతరాజు, సాలిన రవి, కొండే శేషయ్య పాల్గొన్నారు.



చిన్నారావుయాదవ్‌ను సత్కరిస్తున్న ఉద్దాన ప్రాంతవాసులు

ధనరాజులమ్మకు ప్రత్యేక పూజలు



ధనరాజులమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మతల్లిని ఆంధ్ర, ఒడిశాకు చెందిన భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేళతాళాలు, జానపద నృత్యాలు మధ్య అమ్మవారి నైవేద్యంగా భావించే గజముద్దను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. కేశుపురం, స్వేచ్ఛావతి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రోటరీ సేవల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం



కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ సేవా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో రోటరీ పబ్లిక్ ఇమేజ్ ప్రాంతీయ సదస్సును శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావనం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించడం ద్వారా కొత్త సభ్యుల చేరికను పెంచుకోవచ్చుననానరు. ప్రకృతి విపత్తుల సమయంలో క్లబ్ తరఫున విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యఅతిథి, పూర్వ గవర్నర్ సీహెచ్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. రోటరీ ద్వారా 1995 సంవత్సరం నుంచి ప్రపంచంలో పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంస్థలతో పనిచేసి రూ.17,000 కోట్లు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రోటరీ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళా సాధికారత, మహిళ శిశు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. శ్రీకాకుళం క్లబ్ అధ్యక్షురాలు గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు కూడా రోటరీ సేవలను విస్తరించామన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం ప్రతినిధి డాక్టర్ రెడ్డి తిరుపతిరావు మాట్లాడుతూ.. ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా రోటరీక్లబ్ చేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా మరికొంతమంది సేవలు చేరువవుతాయన్నారు. సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో పీడీజీ ఎం.రామారావు, పబ్లిక్ ఇమేజ్ కోఆర్డినేటర్ పి.శివన్నారాయణ, జిల్లా పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎ.వి.రంగారావు, క్లబ్ సెక్రటరీ అన్నెపు అనంతరావు, సెమినార్ చైర్మన్ ఎం.ఆర్.కె.దాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ విజయకుమార్, సీవీ రాజులు, డి.శివశంకర్, ఎస్.వసంతరావు, పసగాడ సూర్య, జైశ్రీరామ్, ఐ.వెంకన్నచెట్టి, బరాటం శ్రీనివాస, అభినవ్ పేర్ల, వి.సంతోష్ కుమార్, మంత్రి వెంకటస్వామి, దూసి సంతోష్, ఇచ్ఛాపురం, సోంపేట, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, ఆమదాలవలస, రాజాం, శ్రీకాకుళం సెంట్రల్ క్లబ్ నుంచి200 మంది రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గడప గడపలో సమస్యలు పరిష్కారం

• హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. సీఎం జగన్ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గసమన్వయకర్త పిరియా సాయిరాజ్ ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమం, లబ్ధిని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలంలో బూర్జపాడు, కేశుపురం, కొఠారీ, లొద్దపుట్టి, ధర్మపురం, కేధారిపురం, బిర్లంగి, తేలుకుంచి, కొళిగాం, పాయితారి, కీర్తిపురం, బాలకృష్ణాపురం గ్రామ సచివాలయం పరిధిలో 16 గ్రామ పంచాయతీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయింది. ఒక్కో సచివాలయం పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన మంచినీటి వెతలు



లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

వర్షాలు దంచికొట్టినా.. అధికంగా ఎండలు పెట్టినా.. ఆ పంచాయతీ పరిధిలోని ప్రజలకు మాత్రం సముద్రం తీరంలోని చలమ నీరే తాగునీరు. ఈ సమస్య నిన్నా, మొన్నటిది కాదు. దశాబ్దాల నుంచి ప్రభుత్వాలు మారినా, నాయకులు హామీలు ఇచ్చినా నెరవేర్చలేని సమస్య 'గడప గడపకు మన ప్రభుత్వం' పుణ్యమాని ఆ గ్రామస్తుల దాహార్తి తీరింది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న పెద్దలక్ష్మీపురం గ్రామస్తుల చెంతకు సుమారు మూడున్నర లక్షల రూపాయలు వ్యయంతో కూడిన శుద్ధజల ప్లాంట్ చేరింది. ఏళ్ల తరబడి మంచినీటికి కటకటలాడే తాము ఇప్పుడు శుద్ధ జలాన్ని వాడబోతున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఇది సాధ్యమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దీర్ఘకాల సమస్యకు పరిష్కారం



పూర్తయిన కల్వర్టు

స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ 2014 ఎన్నికల్లో గెలిచిన తరువాత దత్తత తీసుకున్న గ్రామం తేలుకుంచి. పేరుకే దత్తత తీసుకున్నా.. గ్రామాభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉండేది. 1956లో అదే గ్రామానికి చెందిన దక్కత పరసయ్య అనే వ్యక్తి నిర్మించిన కల్వర్ట్ పదేళ్ల క్రితం కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ. నాలుగున్నర లక్షలతో కల్వర్ట్‌ను నిర్మించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించినా ప్రయోజనం కలగలేదని, తమ గడపకు నేరుగా వచ్చిన సాయిరాజ్ తమ సమస్యకు పరిష్కారం చూపారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు తేలుకుంచి గ్రామస్తులు.



మశాఖపురం బాహుదానది వద్ద నిర్మించిన స్నాన ఘాట్



బొడ్డఖాళీలో నిర్మించిన మండపాం

స్నానాలకు తొలగిన ఇబ్బందులు



చాలా సంవత్సరాలు నుంచి మా గ్రామం మశాఖపురం పొలిమేరలో ఉన్న బాహుదానదిలో స్నానం చేసేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడేవాళ్లం. నదికి వరదలు వచ్చే సమయంలో చిన్నారులు, వృద్ధులు నదిలో జారిపోయి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. రెండు నెలల్లోనే రూ. నాలుగు లక్షలతో స్నాన ఘాట్‌ను నిర్మించారు. దీంతో స్నానాలకు ఇబ్బందులు తప్పాయి.

– పనపాన పోలమ్మ, మశాఖపురం

రణస్థలంలో సిరిమానోత్సవ ప్రచార రథం

రణస్థలం: విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాలు అక్టోబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని పైడితల్లి అమ్మవారి దీక్ష పీఠం వ్యవస్థాపకులు ఆర్. సూర్యపాత్రో తెలిపారు. పైడితల్లి సిరిమానోత్సవ ప్రచార రథం ఆదివారం రణస్థలం చేరుకుంది. సిరిమానోత్సవ ప్రచార పోస్టర్లను ప్రదర్శించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వేదమూర్తి ప్రసాద్, రంగారావు పంతులు, భక్తులు పాల్గొన్నారు.



రణస్థలంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న దృశ్యం